TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.12, Himayatnagar, Hyderabad-500029,Telangana State, Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

12.09.2015

హైద్రాబాద్.

# సంస్కృతాన్ని, ప్రాకృతాన్ని ఎదిరించి నిలిచిన తెలుగు భాష

హిమాయత్‌నగర్‌లోని చంద్రం బిల్డింగ్‌లో తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ వారం 191వ చర్చగా "**తెలంగాణ భాష, తీరుతెన్నులు-అనుసరించటం మరియు అమలుపరచటమెలా?"** అనే అంశంపై టిఆర్‌సి చర్చా కార్యక్రమం జరిగింది. ఆచార్య మాసన చెన్నప్ప, అసిస్టెంట్ ప్రొఫెసర్ సంగిశెట్టి శ్రీనివాస్, భాషా శాస్త్రవేత్త కె.విమల, తెలంగాణ సాహిత్య సమాఖ్య కన్వీనర్ కాంచనపల్లి రాజు, ప్రముఖ కవి మచ్చ ప్రభాకర్ ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా హాజరయ్యారు. కార్యక్రమానికి కె.విమల అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆచార్య చెన్నప్ప మాట్లాడుతూ, సంస్కృతాన్ని, ప్రాకృతాన్ని ఎదిరించి నిలిచింది తెలుగు భాష అని అన్నారు. ఆ రెండు భాషల పదాలు లేకుండానే అచ్చతెలుగు రచనలెన్నో తెలంగాణ నుంచి వచ్చాయన్నారు. ఆంధ్రుల మాతృభాష ప్రాకృతం కాగా వారు మాట్లాడిన తెలుగు భాషనే క్రమంగా ఆంధ్రంగా మారిందని పేర్కొన్నారు. అచ్చతెలుగు భాషకు అక్షరాలు 36 మాత్రమేనని అన్నారు. శాతవాహనులు ప్రాకృతాన్ని ఆదరిస్తే, వారిని ఆదర్శంగా తీసుకొని తదనంతర రాజులు మరీ ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాన్ని ఏలిన రాజులు తెలుగు భాషను ఆదరించారని తెలిపారు. ఆయా రాజులు తెలుగు కవులను ప్రోత్సహించడమే గాకుండా వారు సైతం స్వయంగా ఎన్నో రచనలు చేశారని పేర్కొన్నారు. ధర్మో రక్షిత రక్షిత: తరహాలో భాషో రక్షిత రక్షిత: అనే పరిస్థితి తలెత్తిందని అన్నారు. భాష మన సంపద అని, దాన్ని వారసత్వంగా పొందుతామని, ఆ ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెన్నప్ప అన్నారు.

కె. విమల మాట్లాడుతూ, జన సమిష్టి జ్ఞాపకాల పేటికగా భాషను అభివర్ణించారు. గత చరిత్రను చెప్పేది, భవిష్యత్తును నిర్ణయించేది భాష మాత్రమేనని స్పష్టం చేశారు. ఏ భాష కూడా సహజంగా మృతి చెందదని, పాలకులు అనుసరించే విధానాల వల్లే అది మృతి చెందుతుందని అన్నారు. భాషను చేతిలో పెట్టుకున్న కొందరు మిగితా వారిని చీదరించుకుంటారని, అలాంటి విధానాలే క్రమంగా వలసవాదానికి, అణచివేతకు దారి తీస్తాయని అన్నారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం తెలంగాణ పోరాటమని అన్నారు. భాషా శాస్త్రవేత్తలు ఎంతో మంది తదనంతరం సామాజిక శాస్త్రవేత్తలుగా మారారని, అందుకు కారణం సమాజంతో భాషకు గల అవినాభావ సంబంధమేనని తెలిపారు. భాషా శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలు తదనంతర కాలంలో సామాజిక ఉద్యమాలకు పునాదులు వేశాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంతో తెలుగు భాషకు గల అనుబంధాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు.

సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ భాష వాడకం తదితరాలను ప్రస్తావించారు. తెలంగాణ భాష అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వారు ఈ సందర్భంగా సూచించారు.

టీఆర్‌సీ చైర్మన్ యం.వేదకుమార్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ కె.శంకర్ రావు, సుభాష్, సామాజిక కార్యకర్త ధనుంజయ, యాదయ్య, ప్రముఖ రచయిత గాజోజు నాగభూషణం, ఆర్టీసీ జాక్ ప్రతినిధి ఎం.సుధాకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**నీరజ**

**టిఆర్‌సి**